కాజ్‌వే కష్టాలకు మోక్షం కలిగేనా?

వర్షాకాలానికే పరిమితమవుతున్న హామీలు


కనకాయలంకలో వరద లేని సమయంలో కాజ్‌వే


కనకాయలంక కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)

యలమంచిలి: కాజ్‌వే కష్టాలు తీర్చాలని కనకాయలంక గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. గ్రామానికి మూడు వైపులా గోదావరి ప్రవహిస్తున్న లంక గ్రామం కనకాయలంక. అయితే కనకాయలంక ప్రజలకు తూర్పు వైపున రోడ్డు మార్గం కాజ్‌వే మీదుగా ఉంటుంది. కాజ్‌వే జూలై, ఆగష్టు నెలల్లో వచ్చే గోదావరి వరదలకు, అక్టోబర్, నవంబర్ నెలల్లో అధిక వర్షాలకు మునిగిపోతుంది. ఆ సమయంలో ప్రభుత్వం నాటు పడవలు ఏర్పాటు చేసి ప్రజలు దైనందిన అవసరాలకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తుంది. అనాదిగా ఇదే అలవాటుగా మారింది. కాజ్‌వే ఉన్న ప్రాంతంలో వంతెన నిర్మించి వరదలు, అధిక వర్షాల సమయంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని లంక గ్రామాల ప్రజలు వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడు ఉండడం లేదు.

ఎన్నికలు, వర్షాకాలంలోనే హామీలు : గత ఎన్నికల ప్రచారంలో మంత్రి నిమ్మల రామానాయుడు కూడా మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వంతెన నిర్మిస్తానని హామీ ఇచ్చారని, మళ్లీ ఇప్పుడు ఆ ప్రస్తావన తీసుకురావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే వరదలు వచ్చిన సమయంలో వచ్చే ఉన్నతాధికారులకు వంతెన నిర్మించాలంటూ ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వరదల సమయంలో ఆరోగ్య అత్యవసర స్థితి వస్తే చాలా ఇబ్బందులు పడుతున్నామంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి వంతెన నిర్మాణాలపై దృష్టి పెట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వంతెన నిర్మిస్తామన్న హామీ నెరవేర్చాలి



కనకాయలంక గ్రామంలో 4500 జనాభా ఉంది. ఏడాదిలో సుమారు నాలుగు నెలలు కాజ్‌వే మునిగిపోతుంది. ఆ సమయంలో ప్రజలు బయటకు వెళ్లే పరిస్థితి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలు కూడా ఈ కాజ్‌వే మీదుగానే పాలకొల్లు వెళ్తుంటారు. మూడోసారి ఎమ్మెల్యే, ప్రస్తుతం మంత్రిగా ఉన్న నిమ్మల రామానాయుడు గత ఎన్నికల సమయంలో వంతెన నిర్మాణానికి హామీనిచ్చారు. ఆ హామీని నెరవేర్చి కనకాయలంక ప్రజల కష్టాలను తీర్చాలి.

– గొల్లపల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ, యలమంచిలి

వైరస్‌తో వనామీ విలవిల

- నాణ్యతలేని సీడ్‌తో వైరస్ ప్రభావం
- భారీ పెట్టుబడులతో పెంపకం
- ఆందోళనలో రొయ్య రైతులు


భీమవరం మండలంలోని గూట్లపాడు వైరస్‌బారిన పడిన రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

భీమవరం అర్బన్: ప్రతి ఏటా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు వాతావరణం వనామీ రొయ్యల పెంపకానికి అనుకూలించడంతో రైతులు భారీగా పెట్టుబడులు పెంపకాన్ని సాగిస్తున్నారు. ఎప్పుడూ ఏప్రిల్ నెల రాగానే రైతులు రొయ్యల సీజన్‌గా భావించి భారీ పెట్టుబడులు పెట్టి గంపెడు ఆశలతో సాగు చేసినప్పటికీ నాణ్యతలేని సీడ్ కారణంగా వైరస్ విజృంభించి చెరువుల్లో వనామీ పిల్లలను వదిలిన 20 రోజుల్లోనే మృత్యువాత చెందుతున్నాయని రైతులు చెబుతున్నారు. మూడు నెలలు రొయ్య పెంపకం చేస్తే పెట్టుబడులు పోను కొంత మిగులుబడి రావడంతో రైతులు రొయ్య పెంపకంపై మొగ్గు చూపిస్తున్నారు. అయితే రెండు వారాలుగా పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి రాత్రులు చలిగాలులు వేయడంతో నాణ్యతలేని సీడ్‌కు త్వరితగతిన వైరస్ ప్రబలి మృత్యువాత చెందుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. భీమవరం మండలంలో దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్త పూసలమర్రు, అనాకోడేరు, నాగిడిపాలెం, వెంప, తోకతిప్ప, లోసరి, దొంగపిండి తదితర గ్రామాల్లో సుమారు 7 వేల ఎకరాల్లో వనామీ పెంపకాన్ని చేస్తున్నారు. సీజన్‌లో ఆక్వా హబ్‌గా పేరుగాంచిన భీమవరం పరిసర ప్రాంతాలలో రోజుకు సుమారు 100 టన్నులకు పైగా విదేశాలకు ఎగుమతులు జరుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. కోట్లలో విదేశీ మారకద్రవ్యం రాష్ట్రానికి చేకూరుతుంది. ప్రస్తుతం రొయ్యలు సీడ్ దశలోనే ఉన్నాయి.

వైరస్ దాడికి మృత్యువాత పడుతున్న రొయ్యలు

పగలు పూట ఉష్ణోగ్రతలు పెరిగిపోయి, రాత్రులు చలిగాలులు వేయడంతో చెరువుల్లోని నీటి పరమ ఖువులైన పీహెచ్, అమ్మోనియా, నైట్రోజన్, ఆక్సిజన్ శాతంలలో హెచ్చుతగ్గులు ఏర్పడి రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో, వైట్‌గట్, తదితర వైరస్ రొయ్యలకు వ్యాప్తి చెంది మృత్యువాత చెందుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ వైరస్‌లు వల్ల 30 రోజుల లోపే రొయ్యలు మృత్యువాత చెంది తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు మందులు వాడినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు.

సీడ్ వేసిన నెలరోజుల్లోనే వైరస్ వచ్చేసింది

నేను ఎకరాన్నరలో రొయ్యల చెరువు చేస్తున్నాను. ఎండలు ఎక్కువగా ఉన్నాయని నెల రోజులు క్రిందట సీడ్ తెచ్చి వేశాను. వైరస్ సోకడంతో పిల్ల దశలోనే రొయ్యలు చనిపోతున్నాయి. రొయ్య మేత, మందులు, కూలీల రేట్లు పెరిగిపోవడంతో నెల రోజుల్లోనే రూ. 2 లక్షలు పైగా నష్టపోయాను.

– ఎస్. వెంకటేశ్వర్లు, రొయ్య రైతు, దొంగపిండి

నాణ్యతలేని సీడ్‌తో ఇబ్బందులు

ఎక్కడిబడితే అక్కడ పుట్టగొడుగుల్లా వనామీ ఉత్పత్తి కేంద్రాలు రావడంతో ఏది నాణ్యమైన రొయ్యపిల్లో, కాదో తెలియని అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. నాణ్యత, నాణ్యతలేని సీడో తెలుసుకోవడానికి పీసీఆర్ పరీక్ష ద్వారా ఈహెచ్‌పీ, విబ్రియో, వైట్ స్పాట్ పరీక్షలు చేస్తేనేగానే తెలియదు. నాణ్యమైన సీడ్ లభించాలంటే లక్ష పిల్లలకు రూ. 32 వేలు నుంచి 40 వేలు వరకు ఉంది. నాణ్యతలేని సీడైతే లక్ష పిల్లలకు రూ. 17 వేలు నుంచి 24 పైసలు ఉన్నప్పటికీ 50 శాతం నుంచి 100 శాతం వరకు ప్రకటించడంతో రైతులు వాటికి ఆశపడి నష్టపోతున్నారు.

నాణ్యతలేని హేచరీలను నిర్మూలించాలి

మత్స్యశాఖాధికారులు వనామీ ఉత్పత్తి కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి నాణ్యతలేని సీడ్ ఉత్పత్తి చేస్తున్న హేచరీలను నిర్మూలించాలి. ప్రతి ఏటా ఈ సీజన్‌లో పెట్టుబడులు పోను కొంతైనా మిగిలేది. సీడ్ క్వాలిటీ లేకపోవడంతో వేసిన 15 రోజుల నుంచే వైరస్ ప్రభావం చూపుతుంది.

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

ఉండి: ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు,హెల్పర్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గత సీజన్‌లో తలెత్తిన తేమ శాతం సమస్య పరిష్కారంగా ఈ సీజన్‌లో బ్లూటూత్‌తో తేమశాతం పరీక్షించేందుకు ఏర్పాట్లు చేయడంతో మస్య పరిష్కారం అవుతుందని అన్నారు. మండల వ్యవసాయాధికారి సంధ్య మాట్లాడుతూ రబీ సీజన్ 2024–25 సీజన్‌కు సంబంధించి ధాన్యం రవాణా చేసే వాహనాలు రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర పొందాలి

ఆకివీడు: ధాన్యానికి మద్దతు ధర లభించాలంటే తేమ లేకుండా కొనుగోలు కేంద్రాలకు శాంపిల్స్ తీసుకురావాలని ఏడీఏ కె.శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ధాన్యం కొనుగోలుపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాళ్లు కామన్ ధాన్యానికి రూ. 2300లు, గ్రేడ్-ఏ ధాన్యానికి రూ. 2320లు ధర ప్రకటించిదని చెప్పారు.

సాకారం కాని బోట్ క్లబ్

- ఆక్రమణ చెరలో కొండయ్య చెరువు
- శంకుస్థాపనలకే పరిమితం


కడకట్ల కొండయ్య చెరువు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పెద్ద పెద్ద చెరువులు ఉన్నప్పటికి వాటిని పూడ్చడం, చెరువుల విస్తీర్ణం తగ్గించడం, కొన్ని చోట్ల వాటిని నిరుపయోగంగా మార్చారు. పట్టణంలో ఏళ్లుగా పిల్లలు, పెద్దలు బోటింగ్ చేసేందుకు, నీటి దగ్గర సమయం గడిపేందుకు అధికారులు, నాయకులు ఎటువంటి నిర్ధిష్టమైన ప్రణాళికలు చేపట్టలేదు.

కడకట్ల కొండయ్య చెరువు ఎంపిక

ఈ క్రమంలో ఎట్టకేలకు పట్టణ సుందరీకరణలో భాగంగా పిల్లలు, పెద్దలు ఆహ్లాదం కోసం బోట్ క్లబ్‌ను ఏర్పాటు చేసేందుకు గతంలోనే నిర్ణయించారు. ఇందుకు గాను ఎక్కువ విస్తర్ణంలో ఉన్న కడకట్ల కొండయ్య చెరువు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఏ మూహూర్తాన్ని ప్రారంభమైందో కాని ఆ పనులు ఎక్కడకి అక్కడే నిలిచిపోయాయి.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా..

వివరాల్లోకి వెళ్లితే స్థానిక కడకట్లలోని కొండయ్య చెరువును ఆధునీకరించి బోట్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు దివంగత మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు నిర్ణయించారు. ఓఎన్‌జీసీ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) సామాజిక బాధ్యతలో భాగంగా అందించిన నిధులతో ఈ కార్యక్రమం చేపట్టారు. శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా చెరువులోని పూడికను తీశారు. అదే విధంగా చెరువు చుట్టూ గట్టులను పటిష్టం చేసేందుకు వాల్‌తో సిమ్మెంట్ పనులు చేశారు. ఈ పనులు కారణంగా విశాలమైన చెరువు కాస్త చెరువు విస్తీర్ణం బాగా తగ్గింది. ఏర్పాట్లు పూర్తి అవుతున్న సందర్భంలో అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు నేపథ్యంలో బోట్ క్లబ్ పనులు ఎక్కడవి అక్కడే నిలిచిపోయాయి. నేడు బోట్ క్లబ్ పనులు కొనసాగుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అపరిశుభ్ర పరిసరాలు: కొండయ్య చెరువులో నేడు కలువ పువ్వులు, గడ్డి మొక్కలు పెరిగాయి. మురుగు నీరు, పాకుడు కట్టి పచ్చగా కనిపిస్తోంది. కట్టిన వాల్ నేడు శిథిలావస్థకు చేరుతుంది. పనులు ఆగిపోవడంతో చెరువు నాలుగు వైపుల ఉన్న గట్లు అపరిశుభ్రత పరిసరాలు కానవస్తున్నాయి. ఉపయోగం లేని చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్తా చెదారాలు, పెద్ద పెద్ద రాళ్లు, రప్పలు కానవస్తున్నాయి. అంతేగాక గట్టులు అక్రమణలకు గురవుతున్నాయి. ఒక వైపు పూడ్చివేసిన గట్టు ప్రాంతంలో మాంసం దుకాణం వెలిసింది. ఇస్త్రీ బండి పెట్టుకొని, బట్టలు ఇస్త్రీ చేస్తున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు కారులు పార్కింగ్ ప్లేస్‌గా ఉపయోగించుకుంటున్నారు. బోట్ క్లబ్ కల సాకరం అవుతుందో లేదో తెలియకుండా ఉంది. బోట్ క్లబ్ ఏర్పాటుతో పాటు ఒక వెళ పనులు ఆలస్యమైతే చెరువును పూడ్చకుండా చూడాలని, చెరువు గట్లు అయినా అక్రమణలకు గురి కాకుండా చూడాలని, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

బోట్ క్లబ్ ఏర్పాటు చేయండి



పిల్లలు, యువతీ, యువకులు, పెద్దలు ఆహ్లాదం కోసం, ఆనందం కోసం పట్టణంలో అన్ని హంగులతో కూడిన బోట్ క్లబ్ ఏర్పాటు చేయాలి. సెలవులు సమయంలోను, వేసవి సెలవుల లోను బోట్ క్లబ్ ఉంటే ఎంతో ఉపయుక్తం. ఆ దిశగా పాలకులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలి.

– ఎస్.ఎం.సుభాని, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

ఉపాధి పనులు ప్రారంభం


ఉపాధి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెం పంచాయతీకి ఉపాధి నిధులు రూ.48 లక్షలు మంజూరయ్యాయని గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యమాంబ తెలిపారు. బుధవారం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామంలోని 58 పనులు చేపట్టనున్నామన్నారు. గ్రామంలోని కూలీలందరికీ 100 రోజుల పని కల్పిస్తామన్నారు. గతంలో రూ. 300 కూలీ ఇచ్చేవారని ఈ ఏడాది రూ.307 లకు పెరిగిందన్నారు. గ్రామంలో 320 మంది పేద కూలీలు ఈ పనుల్లో భాగస్వాములవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, ఉప సర్పంచ్ తెలగంశెట్టి శ్రీదేవి వాసు, గుబ్బల లక్ష్మణరావు, కూనపరెడ్డి సూర్యనారాయణ, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న ఏపీఎం నాగభూషణం నాయుడు

నరసాపురం రూరల్: డ్వాక్రా సంఘాల వ్యాపార అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఏపీఎం జక్కంపూడి నాగ భూషణంనాయుడు అన్నారు. బుధవారం నరసాపురం స్టీమర్ రోడ్డులోని మండల సమాఖ్య భవనంలో ఎన్యూమరేటర్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డ్వాక్రా గ్రూపులలోని సభ్యులు వారి వ్యాపార, పిల్లల చదువు, గృహ నిర్మాణాలకు సంబంధించి రుణాల కోసం వార్షిక ఆర్థిక రుణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక ఎలా చేయాలో? అనే అంశంపై సీసీలు కేవీ సత్యనారాయణ, యర్రంశెట్టి వేణుగోపాల్, డి.సుందరరావు తదితరులు శిక్షణను ఇచ్చారు. గత మూడు రోజులుగా నాలుగు బ్యాచ్‌లుగా మండలంలోని ఎన్యూమరేటర్లకు ఇచ్చిన శిక్షణ బుధవారంతో ముగిసిందని ఏపీఎం తెలిపారు.

సుఖ ప్రసవాలకే తొలి ప్రాధాన్యం


సుఖ ప్రసవాలపై పెనుగొండ సీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రభుత్వాసుపత్రుల్లో సుఖ ప్రసవాలకే తొలి ప్రాధాన్యతనిస్తున్నామని, దీని వల్ల తల్లీబిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉంటారని పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ విజయ లక్ష్మీ అన్నారు. బుధవారం పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గర్భిణులకు సుఖ ప్రసవాలపై అవగాహన కల్పించారు. సుఖ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. శస్త్ర చికిత్స వల్ల జీవితాంతం ఇబ్బందులు పడతారని, కాబట్టి వైద్యుల సూచన మేరకే శస్త్రచికిత్సలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు గుణ్ణం సవేరీ, టీఎస్‌వీ భాస్కరరావు, సుప్రియ, దీపిక పాల్గొన్నారు.

వైభవంగా శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు


వడలిలో గాలిగోపుర శిఖర ప్రతిష్ఠ హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: వడలిలో అగస్తేశ్వరస్వామి ఆలయ గాలి గోపుర శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభించారు. ఉదయం నుంచి ఆలయంలో అగస్తేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, త్రిశూల పూజ, దీక్షాధారణ, పుణ్యాహవచనం, ధాన్యాధివాసం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అంకురారోహణ, వాస్తు హోమాలు నిర్వహించారు. గురువారం ఉదయం శిఖర ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

ప్రశాంతంగా జేఈఈ పరీక్ష

తాడేపల్లిగూడెం: జేఈఈ మెయిన్ పరీక్షలు బుధవారం స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పరీక్షకు 60 మంది హాజరయ్యారు. మధ్యాహ్న సెషన్‌కు 57 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను డాక్టర్ సుభాష్ భగవాన్ పర్యవేక్షించారు.

ట్రాక్టర్ బోల్తా-డ్రైవర్‌కు గాయాలు

పెనుగొండ: ఆచంట మండలం కోడేరు బ్రాంచ్ కెనాల్లో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కోడేరు రేవు వద్ద లాకుల సమీపంలో ఏటిగట్టు వద్ద గత కొన్నేళ్ల నుంచి నిద్రగన్నేరు చెట్టు లాకుకు ఇబ్బందిగా ఉండడంతో చెట్టును బుధవారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే తొలగించిన కొమ్మలను ట్రాక్టర్ సహాయంతో తీసుకెళ్లే సమయంలో వంతెనపై కర్రల లోడుతో ఉన్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బ్రాంచ్ కెనాల్లోకి పడిపోయింది. దీంతో స్థానికులు వెంటనే స్పందించి డ్రైవర్ను బయటకు తీసుకువచ్చారు. డ్రైవర్ కు తీవ్రగాయాలు కావడంతో వెంటనే 108 వాహనం ద్వారా పాలకొల్లు తరలించారు. దీంతో పెద్దప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. లాకుల వద్ద గత కొన్ని ఏళ్లుగా నిద్రగన్నేరు చెట్టు అడ్డుగా ఉండటంతో కమిటీ సభ్యుల తీర్మానం మేరకు చెట్టు, చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టామని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

రీ-సర్వే పనుల్లో తప్పిదాలను నివారించాలి

పాలకోడేరు: రీ-సర్వే పనుల్లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా పూర్తిస్థాయిలో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పైలెట్ గ్రామం అయిన శృంగవృక్షం గ్రామంలో రీ-సర్వే పనులకు సంబంధించి పెన్నాడ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ రూమును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆకస్మిక సందర్శించారు. శృంగవృక్షం గ్రామానికి సంబంధించిన రీ సర్వే వెక్టొరైజేషన్ పనులు, రికార్డులను, డేటాను పరిశీలించారు. సిబ్బందికి రీ సర్వేపై పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే వెక్టొరైజేషన్ డిజిటల్ పనులను పూర్తి చేసి రైతులకు నోటీసులు అందజేయాలని అన్నారు. రీ సర్వే పనులు సంతృప్తిగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. మిగిలిన రీ సర్వే పనులలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఈనెల 15 నాటికి పూర్తిస్థాయిలో నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే మండలంలోని కుముదవల్లి గ్రామంలో కూడా రీ-సర్వే పనులు మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్, మండల సర్వేయర్లను ఆదేశించారు. తొలుత విస్సాకోడేరు గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండియూ వాహనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ విజయలక్ష్మి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రీ-సర్వే డీటీ కె.సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నాటిక పోటీలు


జనరల్ బోగీ నాటికలోని సన్నివేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఉగాది నాటిక పోటీలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి జనరల్ బోగీలు నాటిక పాల్గొన్న సభికులను అలరించింది. జనరల్ బోగీలో ప్రయాణిస్తు తన కొడుకు మృత్యువాతకు గురైతే అప్పటి నుంచి మృతి చెందిన తన కొడుకు ఆచూకీ కోసం తల్లి పడుతున్న వేదన ఈ నాటిక. నిర్లక్ష్యానికి గురవుతున్న జనరల్ బోగీలు, రక్షణ, సౌకర్యాలు, భద్రతా లోపాలు అంశాలపై ఈ నాటిక ఎండకట్టింది. రైలు ప్రమాదంలో జనరల్ బోగిలో ప్రయాణించే వారు వివరాలు ఉండవు. మృతి చెందిన వారి వివరాలు, ఆచూకి తెలియదు. రిజర్వేషన్ బోగీలతో సమానంగా జనరల్ బోగీలు సంఖ్యను పెంచాలని, జీవితంలో రైలులో జనరల్‌బోగి ఎక్కని ప్రయాణీకుడు ఉండడని, జనరల్ బోగిలో కూడా భద్రంగా ప్రయాణించే రక్షణ కావాలని తదితర అంశాలను ఈ నాటికలో ప్రదర్శించారు. రచన పీటీ మాధవ్, దర్శకత్వం గోపరాజు విజయ్, కళాకారులను సత్కరించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు

పెనుగొండ: మండలంలో చిన్నారుల ఆధార్ నమోదుకు ఆధార్ మొబైల్ క్యాంపులు ఆరు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 3,4 తేదీల్లోనూ, తిరిగి 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 3న చినమల్లం సచివాలయం, రామన్నపాలెం సచివాలయం, దేవ సచివాలయాల్లోనూ, 4న నడిపూడి సచివాలయం, వెంకట్రామపురం సచివాలయం, కొఠాలపర్రు, సోమరాజు చెరువులకు గానూ కొఠాలపర్రు సచివాలయంలోనూ నిర్వహిస్తామని వివరించారు. అదేవిధంగా ఇలపర్రు 8, 9 తేదీల్లోనూ, ములపర్రు సచివాలయంలో 10,11 తేదీల్లోనూ, దొంగరావిపాలెం, సిద్ధాంతం గ్రామాలకు సిద్ధాంతం సచివాలయంలో 9,10 తేదీల్లోనూ, వడలి సచివాలయంలో 11వతేదీన, పెనుగొండ-2 సచివాలయంలో 8,9 తేదీల్లోనూ, పెనుగొండ -1 సచివాలయంలో 10,11 తేదీల్లోనూ క్యాంపులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. చిన్నారులను అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తించి ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేసుకునే విధంగా కృషి చేయాలని కోరారు.

రేపు ఏఎస్ఎన్ఎం కళాశాల వార్షికోత్సవం


కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశుభ్రత కార్యక్రమం ప్రారంభించారు. ఏప్రిల్ 4న జరిగే కళాశాల 58వ వార్షికోత్సవాలకు కళాశాల ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. బుధవారం డిగ్రీ విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ శుక్రవారం జరగబోయే వార్షికోత్సవ వేడుకలకు విద్యార్థులంతా కళాశాలను పరిశుభ్రం చేయడానికి శ్రమదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ బూసి వెంకటస్వామి, శివరామకృష్ణ, మన్మదరావు, కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ పసుపు, కుంకుమ అందజేత


గడపగడపకూ పసుపు, కుంకుమలు అందజేస్తున్న పాతూరి వెంకట సుబ్బలక్ష్మి, హైమావతి

యలమంచిలి: ఉగాది ఉత్సవాలలో భాగంగా పెనుమర్ర గ్రామంలోని శ్రీఉమాపార్వతి సమేత వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో గత సోమవారం ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్‌శర్మ బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన పాతూరి వెంకట సుబ్బలక్ష్మి, ఆమె కుమార్తె రుద్రరాజు హైమావతి కైలాస గౌరీ నోము నిర్వహించారు. నోము అనంతరం ప్రసాదంగా గ్రామంలోని 825 మంది ముత్తయిదువలకు పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు తాంబూలంగా పంపిణీ చేస్తున్నారు. బుధవారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గడపలకు బొట్టు పెట్టి ముత్తయిదువలకు పసుపు, కుంకుమ వాయినం ఇచ్చారు.

అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం


విద్యార్థులతో చదివిస్తున్న భవానీ ప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: పుస్తకాలు చదవడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరతాయని ఇందులో కొత్త విషయాలు తెలుసుకోవచ్చని హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. బుధవారం జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్ 1967లో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం ప్రారంభించిందన్నారు. చదవడం వల్ల పదజాల అభివృద్ధి పెరుగుతుందన్నారు. విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చి చదివించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ చేయించాలి

వీరవాసరం: పాస్టర్ పగడాల ప్రవీణ్ ఆకస్మిక మృతిపై ప్రత్యేక విచారణ చేపట్టాలని వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు డిమాండ్ చేశారు. వీరవాసరంలో బుధవారం నిర్వహించిన క్రైస్తవ సంఘాల నిరసన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ ప్రవీణ్ మృతిని యాక్సిడెంట్ కేసుగా పరిగణించడం పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. వెంపల్ల నరసింహమూర్తి, తాడి రాజశేఖర్ పాల్గొన్నారు.